అధ్వాన రహదారికి మోక్షం

- వైఎస్సార్‌సీపీ పాలకవర్గం చొరవ
- 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రతిపాదనలు
- సాంకేతిక అనుమతులు రాగానే రోడ్ల నిర్మాణం

జంగారెడ్డిగూడెం: అధ్వానంగా ఉన్న రహదారికి మోక్షం కలగనుంది. జంగారెడ్డిగూడెం మున్సిపల్ వైఎస్సార్‌సీపీ పాలకవర్గం సుబ్బంపేట రోడ్డులోని కొంత భాగాన్ని నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదించింది. వైఎస్సార్‌సీపీ పాలకవర్గం చొరవతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.67 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసింది. ప్రస్తుతం సాంకేతిక అనుమతులు పొందాల్సిన స్థాయిలో ప్రతిపాదనలు ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గాల్లో సుబ్బంపేట రోడ్డు మార్గం ఒకటి. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో సుబ్బంపేట ప్రాంతంతో పాటు బాలాజీనగర్, ఎన్‌టీఆర్ నగర్, లోకేష్ నగర్, రాజీవ్ నగర్లకు ఇదే ప్రధాన మార్గం. ఈ ప్రాంతాల వారు జంగారెడ్డిగూడెం పట్టణంలోకి రావాలంటే ఈ రోడ్డు మార్గం గుండానే వస్తారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో స్థానిక బైపాస్ రోడ్డు నుంచి లలితాదేవి గుడి వరకు రోడ్డు ఛిద్రమైంది. ఈ రోడ్డు మార్గంలో లలితాదేవి గుడి, సాయిబాబా గుడి ఉండటంతో నిత్యం భక్త జనంతో రద్దీగా ఉంటుంది. దీంతో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో మట్టి రోడ్డును తలపిస్తోంది. వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు.

స్పందించిన మున్సిపల్ పాలకవర్గం

ఇక్కడ ఒక రోడ్డు ఉండేది అన్న చందంగా రోడ్డు పరిస్థితి తయారు కావడంతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలోని మున్సిపల్ పాలకవర్గం స్పందించి రోడ్డు నిర్మాణానికి సమాయత్తమైంది. గతంలో అధ్వానంగా ఉన్న సుబ్బంపేట రోడ్డులో కొంత భాగాన్ని నిర్మించారు. స్థానిక శ్రీనివాసపురం రోడ్డు మొదలుకొని లలితా దేవి గుడి వరకు బీటీ రోడ్డును నిర్మించారు.

త్వరలో రోడ్డు నిర్మిస్తాం



జంగారెడ్డిగూడెం పట్టణంలోని సుబ్బంపేట–బైపాస్ రోడ్డును కలిపే రోడ్డును త్వరలో నిర్మిస్తాం. ఈ రోడ్డులో కొంత భాగాన్ని ఇప్పటికే నిర్మించాం. మిగిలిన భాగమైన లలితాదేవి గుడి నుంచి బైపాస్ వరకు ఉన్న రోడ్డును నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించేందుకు ఇప్పటికే కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తాం.

– బత్తిన లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్, జంగారెడ్డిగూడెం



సాయిబాబా గుడి ప్రాంతంలో ధ్వంసమైన రహదారి



సుబ్బంపేట నివాసిత ప్రాంతంలో అధ్వానంగా ఉన్న రహదారి

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



రాఘవాపురంలో దగ్ధమవుతున్న తాటాకిల్లు

చింతలపూడి: మండలంలోని రాఘవాపురం గ్రామంయండపల్లి రోడ్డులో రుద్రాక్షల పద్మ అనే మహిళకు చెందిన తాటాకిల్లు గురువారం దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తు సమాచారం మేరకు అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి కోటేశ్వరరావు తెలిపారు.

వైభవంగా పోతురాజు విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించిన

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రజల ఇలవేల్పు, గ్రామ దేవత, శ్రీచింతాలమ్మ అమ్మవారి ఆలయంలో పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి సోదరుడైన పోతురాజు విగ్రహాన్ని దిప్పకాయలపాడులో ప్రత్యేకంగా తయారు చేయించి రైతు అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఆసాదుల సమక్షంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ చేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. నేరేడుమిల్లికి చెందిన బుద్ధా రాజుశ్రీ వెంకట సూర్యనారాయణరాజు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.


కైలాసనాథ విగ్రహ ఆవిష్కరణ



కైలాసనాథ మహాదేవుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని తిరుమలాపురంలో బైనేరు ఒడ్డున కైలాస భూమి సమీపంలో కై లాసనాథ మహాదేవుడి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. కనుపర్తి వెంకట సింహాద్రి ఆధ్వర్యంలో ఆధ్యాత్మికవేత్త కేశిరాజు వెంకట్రాజు, ఉమా సుందరీ దంపతుల చేతుల మీదుగా మహాదేవుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సామాజికవేత్త కనుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్ మాట్లాడుతూ స్వర్గీయ కనుపర్తి శ్రీహరిరావు, సూర్యలక్ష్మి దంపతుల 71వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మహాదేవుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ కనుపర్తి శ్రీనివాస్, అర్చకులు వేదాంతం వెంకటాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి ధర్మ ప్రచార రథం పర్యటన



శ్రీవారి ధర్మ ప్రచార రథం

ద్వారకాతిరుమల: శ్రీవారి ధర్మ ప్రచార రథం పర్యటన వివరాలను ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి గురువారం విలేకరులకు వెల్లడించారు. శుక్రవారం పోలవరం, చాట్రాయి, నరసాపురం, అనంతరం విస్సన్నపేట లోని ఎస్సీ కాలనీలో స్వామివారి ధర్మప్రచార రథం పర్యటిస్తుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో ధర్మ ప్రచార నిర్వహణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

టి.నరసాపురం: స్థానిక 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్, లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నందున టి.నరసాపురం, మక్కినవారిగూడెం, బండివారిగూడెం, మధ్యాహ్నపువారిగూడెం, తిరుమలదేవిపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్లకు 22వ తేదీ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ



భరగడ సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): పోలవరం నియోజకవర్గం, జీలుగుమిల్లి మండలం, మడకంవారిగూడెంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు భరగడ సావిత్రి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం వారి కుటుంబ సభ్యులను బాలరాజు పరామర్శించి ధైర్యం చెప్పారు. అనతరం సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీకి సావిత్రి లేని లోటు తీరనిదన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాలి

పోలవరం రూరల్: పోలవరం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద గత ప్రభుత్వం ప్రారంభించిన పోలవరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ప్రజలు వైద్యం కోసం రాజమండ్రి, కాకినాడ వంటి ఆసుపత్రులకు వెళుతున్నారని పోలవరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పూర్తి చేస్తే ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. మండల కేంద్రం పోలవరం నుంచి బోడిగూడెం మీదుగా రేపల్లెవాడ, దొండపూడి నుండి కుంకాల, పేద్రాల వరకు, చింతపల్లి నుంచి గెడ్డపల్లి వరకు ప్రధాన రహదారులు పూర్తిగా పాడై పోయాయన్నారు. పోలవరం మండలం లో ఉన్న ప్రధాన రహదారులు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణంకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు.

రేపు శ్రీవారికి సహస్ర దీపాలంకరణ సేవ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో నూతనంగా ప్రవేశ పెట్టిన సహస్ర దీపాలంకరణ సేవా వేడుక ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం దీపాలంకరణ సేవను నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 గంటల నుంచి జరిగే ఈ వేడుకలో పాల్గొనే దంపతులు రూ.500 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. శాశ్వత విరాళంగా రూ.5 వేలు చెల్లిస్తే పదేళ్ల పాటు (సంవత్సరంలో ఒక శనివారం) ఈ సేవను జరిపించుకోవచ్చన్నారు. కావున భక్తులు ఈ వేడుకలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఈఓ కోరారు.

వీధి శునకాలతో ప్రజల బెంబేలు



గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

కుక్కునూరు: మండలంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా తిరుగుతూ దారినపోయే వారిపై దాడులు చేస్తుండడంతో ప్రజలు రోడ్ల మీదకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఇటీవల కుక్కలు గేదెలు, లేగ దూడలపై, గొర్రెలపై, మేకలపై దాడులు చేస్తున్నాయి. గత రెండు రోజుల క్రితం కుక్కునూరు గాంధీనగర్ వీధిలో ఓ ఇంటిలో రెండు నెలల లేగదూడను చంపి తిన్నాయి. ఇటువంటి ఘటనలు మండల వ్యాప్తంగా ప్రతి రోజూ జరుగుతూనే ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలలో గడిచిన 20 రోజుల్లో అమరవరం పీహెచ్‌సీ పరిధిలో 12 కుక్క కాటు కేసులు నమోదు కాగా, కుక్కునూరు పీహెచ్‌సీ పరిధిలో 4కుపైగా కేసులు నమోదైనట్లు తెలుస్తుంది. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా సుబ్రమణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసిన దృశ్యం

కామవరపుకోట: మండలంలోని తూర్పు యడవల్లి గ్రామం విద్యాధరనగర్‌లో సుబ్రహ్మణ్యస్వామి శిలా విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీహయగ్రీవ పీఠ వ్యవస్థాపకులు శ్రీ సుదర్శనం దుర్గబాబు ఆధ్వర్యంలో చలమాల రాంబాబు, కనకదుర్గ దంపతులు ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు భక్తుల సహకారంతో అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన నిందితుడు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చింతలపూడి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. కంచనగూడెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ స్థావరాలపై జరిపిన దాడుల్లో శాకా చంద్రావును అరెస్ట్ చేసి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అదే విధంగా మేడూరి బన్నీ అనే వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. మండలంలోని శివపురం గ్రామంలో ఎన్‌డీపీఎల్ పాత కేసుల్లో ముద్దాయి అయిన గుత్తా వెంకటేశ్వరావును చింతలపూడి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై అబ్దుల్ ఖలీల్, ఏలూరు ఈఎస్‌టీఎఫ్ ఎస్సై ఎండీ ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కునూరు: మండలంలోని శ్రీధరవేలేరు గ్రామ అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రాలపై గురువారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో సారాయి తయారీ, అమ్మకందారులపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఏఎస్ సుబ్రహ్మణ్యం, హెడ్‌కానిస్టేబుళ్లు కె.అప్పారావు, బి.సురేష్, కానిస్టేబుళ్లు ఎం.సంతోష్ కుమార్, కేవీవీ ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ద్వారకాతిరుమల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్, జి.కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఐఎస్ రాఘవాపురం, కోడిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని ఈస్ట్ యడవల్లి ఫీడర్లకు శుక్రవారం మరమ్మతులు నిర్వహిస్తామని విద్యుత్‌శాఖ ఈఈ కేఎం అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులతో పాటు, విద్యుత్ లైన్లకు అడ్డొచ్చే చెట్లను తొలగిస్తామన్నారు. ఈ పనుల నిమిత్తం ద్వారకాతిరుమల, కొమ్ముగూడెం, లక్ష్మీపురం, కొత్తగూడెం, రామసింగవరం, కోడిగూడెం, సాయన్నపాలెం, వెంకటకృష్ణాపురం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

కొయ్యలగూడెంలో

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 08:00 గం నుండి మధ్యాహ్నం 10:00 గం వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రామారావు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో గల గవరవరం, పరింపూడి, అంకాలగూడెం గ్రామాల వినియోగదారులు, కన్నాయిగూడెం, అచ్యుతాపురం గ్రామ వ్యవసాయ వినియోగదారులు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

- ఇప్పటికే సిద్ధమైన ఓటర్ల జాబితా
- డిసెంబర్ మొదటి వారంలో జరిపే అవకాశం



బుట్టాయగూడెం మండలంలోని జల్లేరు జలాశయం

బుట్టాయగూడెం: సాగునీటి సంఘాల ఎన్నికలకు రెవెన్యూ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. వాస్తవానికి నవంబర్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో డిసెంబర్ మొదటి వారంలో జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందుగా గ్రామాల్లో సాగునీటి కాలువలు, చెరువుల ఆయకట్టు భూముల సర్వే నెంబర్లు, రైతుల వివరాలను, పాత జాబితాలోని మార్పులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సేకరించి నమోదు ప్రక్రియ దాదాపు పూర్తి చేశారు. అలాగే ఆ జాబితాకు సంబంధించిన వివరాలను ఆయా పంచాయతీల పరిధిలో నిర్వహించే జాబితాను పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. అయితే ఈ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ఆయకట్టుదారుల సమావేశం, తుది జాబితా ప్రకటన, ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారు.

పోలవరంలో 52 సాగునీటి సంఘాలు

పోలవరం నియోజకవర్గంలో 7 మండలాలు ఉండగా వీటిలో 5 మండలాల్లోని సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. బుట్టాయగూడెం–21, పోలవరం–8, జీలుగుమిల్లి–6, టి.నర్సాపురం–4, కొయ్యలగూడెం మండలం–13 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే వేలేరుపాడు మండలం పెద్దవాగు ప్రాజెక్టు ఉన్నప్పటికీ ఇటీవల వరదల్లో ప్రాజెక్టు దెబ్బ తినడంతో అక్కడ ఎన్నికల నిర్వహించడం లేదని అధికారులు చెప్పారు. అలాగే కుక్కునూరు మండలంలో కూడా సాగునీటి సంఘాల ఎన్నికలు జరగడం లేదని తెలిపారు. నియోజకవర్గంలో 52 సాగునీటి సంఘాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. డిసెంబర్ మొదటి వారంలో ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

ఆయకట్టు దారులకు ఓటు హక్కు ఇలా

చెరువులు, కాలువల కింద భూముల సాగుదారులకు ఓటుహక్కు ఉంటుంది. కనీసం సెంటు భూమి ఉన్న రైతు కూడా ఓటరుగా నమోదవుతాడు. మూడేళ్ల నీటి పన్ను చెల్లించి ఉండాలి. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నిక జరుగుతుంది. చెరువుల నిర్వహణ, అభివృద్ధి నీటి పన్నుల వసూలు, వాటి బాధ్యతలను నీటి సంఘాలు నిర్వర్తిస్తాయి.

కూటమిలో నెలకొన్న పోటీ

నియోజకవర్గంలోని 52 నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్న సమయంలో కూటమిలో పోటీ నెలకొనే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే అవకాశం ఉందని తెలుస్తుంది. కూటమి నేతలకు మరిన్ని పదవులు ఇచ్చేందుకు ఈ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించనుంది. 2015 తర్వాత జరిగే ఈ ఎన్నికలకు కూటమిలో జనసేన, టీడీపీ నేతల మధ్య పోటీ పడే నెలకొనే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రధానంగా బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, పోలవరం మండలాల్లో పోటీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అయితే కూటమి పార్టీలోని భాగస్వామి పార్టీల సర్దుబాటు జరుగుతుందా ? లేక ఏకపక్షం అవుతుందా ? లేక పోటీ జరుగుతుందా ? అనేది వేచి చూడాల్సి ఉంది.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పోలవరం నియోజకవర్గంలో 52 నీటి సంఘాలు ఉన్నాయి. వాటికి సంబంధించి డిసెంబర్ మొదటివారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

టి. సురేష్, ఇరిగేషన్ శాఖ ఏఈఈ, కేఆర్‌పురం

వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యలగూడెం: సరిపల్లిలో ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా గురువారం బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఎన్‌సీడీ యాప్‌లో నమోదు చేసి, 18 సంవత్సరాలు దాటిన వారికి బీపీ పరీక్ష, మధుమేహం (షుగర్)కు రక్త పరీక్ష, హిమోగ్లోబిన్ శాతం పరీక్ష, కాన్సర్‌కు సంబంధించిన నోటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజల జీవన శైలిలో, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల వల్ల సమాజంలో అసంక్రమణ వ్యాధులైన బీపీ, డయాబెటీస్, కాన్సర్ వ్యాధులు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.సుబ్బారావు, ఎంఎల్‌పీకే విమలాదేవి, ఏఎన్ఎం కె.గంగాదేవి, ఆశ కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గోశాల నిర్మాణం



నిర్మాణంలో ఉన్న గోశాల

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి వారి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న గోశాల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. సుమారు రూ.5 లక్షలతో గోశాలను నిర్మిస్తున్నట్లు పాలకమండలి కమిటీ చైర్మన్ మద్దు గోపి తెలిపారు. గోశాలలో ఏక సమయంలో పది గోవుల వరకు రక్షణ పొందే విధంగా వృత్తాకారంలో షెడ్డు నిర్మించామని, గోవుల మేతకు అనువుగా గ్రాసం తొట్టెను ఏర్పాటు చేశామన్నారు. గోశాల శాశ్వత నిర్వహణకు అనువుగా దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని సుమారు రూ.5 లక్షల స్థిర నిధిని ఏర్పాటు చేసి, ఆ మొత్తాన్ని గోవుల గ్రాసానికి వినియోగిస్తామన్నారు.

24న ఉపాధ్యాయులకు శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులకు మానవత, స్టెప్, అపుస్మా నిర్వహణలో ఈ నెల 24న ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశామని మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కోనేరు సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ఆడిటోరియంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రత్యూష సుబ్బారావు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 98855 67789, 95333 37799లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

విజిలెన్స్ దాడులు

ఉంగుటూరు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఉంగుటూరులో దాడులు నిర్వహించారు. సత్యం టిఫిన్ సెంటర్‌లో గృహ అవసరాలకు వినియోగించే 6 సిలిండర్లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నామని, యజమాని

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

ఏలూరు(మెట్రో): రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు వారి ఖాతాలకు సొమ్ము జమ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై పౌర సరఫరాలు, సహకార, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో 250 రైతు సేవా కేంద్రాల ద్వారా గత నెల 22 నుంచి నేటి వరకు రూ.136.44 కోట్ల విలువైన 58,102.800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని, రైస్ మిల్లుకు తరలించినట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలులో సందేహాలుంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 08812-230448, 7702003584, టోల్ ఫ్రీ 18004256453కు